
మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 63 బుధవారం 06 - 08 - 2025 పేజీలు: 8 వెల: 4

## వికృత రాతలతో ఆటోలు




3లో..



### మహిళల భద్రత కోసం బస్సుల్లో
# సీసీ కెమెరాలు

- అంతరాష్ట్ర సర్వీసుల్లో ఉచిత ప్రయాణంపై మంత్రి మండలిదే తుది నిర్ణయం - మహిళల ఉచిత ప్రయాణంపై మంత్రివర్గ ఉప సంఘం నివేదిక

మన గళం, అమరావతి : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం వల్ల రద్దీ పెరుగుతు ఒదని, మహిళల భద్రత కోసం అన్ని బస్సుల్లో సీసీటీవీ కెమెరా లు ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సూచి ంచింది. ఈ పథకంపై రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, హోం మంత్రి అనిత, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యా రాణిలతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమై అయి చర్చించింది. రవాణాశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్టీసీ ఎండీ ద్వార కా తిరుమలరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఉప సంఘం గతంలో కర్ణాటక రాష్ట్రంలో పథకం అమలును పరిశీలించింది. అక్కడ గమనించిన అంశాలు ఇక్కడ పథకం ఎలా అమలు చేయవచ్చనేది సూచిస్తూ నివేదికను సిద్ధం చేసింది. సోమవారం మంత్రివర్గ సభ్యులు రవాణా శాఖ కార్యద ర్శి కాంతిలాల్ దండేకు ఈ రిపోర్ట్‌ను అందజేశారు. ఈ నివేదికను బుధవారం జరిగే కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో తిరిగే సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో, రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడినైనా మహిళలు ప్రయాణించేలా ఈ పథకం అమలు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది అయితే, అంతర్ రాష్ట్ర సర్వీసులుగా (తిరుపతి-చెన్నై, అనంతపురం-బెంగళూరు వంటివి) తిరిగే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పథకాన్ని వర్తింపజేయాలా? వద్దా అనే

2లో..



### ఉత్తరాఖండ్‌లో
# జలప్రళయం

- గ్రామాన్ని ముంచెత్తిన వరద..
- 60 మంది గల్లంతు..

మన గళం డెస్క్ : ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. తాజాగా ఉత్తరకాశీ జిల్లాని వరద చుట్టుముట్టింది. క్లౌడ్‌బరస్ట్ కారణంగా కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి ఖీర్ గంగా నది ఒక్కసారిగా విరుచుకుపడింది. ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు చోట్ల భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. వరద ప్రవాహం ధరాలీ గ్రామాన్ని ముంచెత్తడంతో వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఊహించని జలప్రళయంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ విపత్తులో దాదాపు 60 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న ఆర్మీ, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన భయానక దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



### ప్రయాణికుల మాటున గంజాయి
## తరలిస్తున్న మహిళలు అరెస్టు


- విజయవాడ రైల్వే స్టేషన్‌లో ముగ్గురు మహిళల వద్దకు వెళ్లి ఆగిన పోలీస్ డాగ్
- 30 కిలోల గంజాయిని ముగ్గురు మహిళల నుంచి స్వాధీనం

మన గళం, విజయవాడ : ప్రయాణికుల మాటున గంజాయి తరలిస్తున్న ముగ్గురు మహిళలను విజయవాడ రైల్వే స్టేషన్‌లో నార్కో డాగ్ 'లియో పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించింది. 30 కిలోల గంజాయిని ముగ్గురు మహిళల నుంచి స్వాధీనం చేసుకుని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఏపీలో గంజాయిపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోంది. ఏజెన్సీ ప్రాంతం నుంచి తెస్తున్న గంజాయిని సీజ్ చేసి అరెస్టులు చేస్తూ ఎక్కడిక్కడ అరెస్టులు చేస్తున్నారు పోలీసులు, ఈగల్ టీం. అయితే ఇటీవల జాతీయ రహదారిపై నిఘా పెరగడం ఏ వాహనాన్ని వదలకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేస్తూ ఉండటంతో గంజాయి స్మగ్లర్లు కొత్తదారిని ఎంచుకున్నారు.

2 లో..

# ఘనంగా మంత్రి టి.జి.భరత్ జన్మదిన వేడుకలు





(మన గళం,కర్నూలు సిటి) : రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నగరంలోని స్థానిక సంకల్ బాగ్ లో ఉన్న టి.జి.నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర మంత్రి టి.జి.భరత్ కు పుష్ప గుచ్ఛాన్ని అందజేసి, జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి.వెంకటేష్ ను మర్యాదపూ ర్వకంగా కలిసి, బొకే అందజేశారు. కారక్రమంలో సుమన్ టివి కర్నూలు ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్ కిరణ్ పాల్గొన్నారు.

### రాహుల్‌పై మోదీ
# విసుర్లు



- యావత్ ప్రపంచం వారి ప్రవర్తనను చూసింది
- వాళ్లను మనమెందుకు ఆపాలి?
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

మన గళం, న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌పై విపక్షాలు పార్లమెంటులో చర్చకు పట్టుబట్టి ప్రభుత్వం ముందు నిలవలేక పోయాయని, ఇప్పుడు ఎందుకు చర్చకు పట్టుబట్టామా అని విచారిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వచ్చిన ఒకే ఒక్క అవకాశాన్ని కూడా వినియోగించుకోలేకపోయాయని

2 లో..

# వినూత్నంగా రేషన్ కార్డ్స్ అందిస్తాం



మన గళం, విశాఖపట్నం : రాష్ట్రంలో మరింత కొత్త గా.. వినూత్నంగా రేషన్ కార్డ్స్ అందిస్తామని పౌర సరఫ రాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ సరుకులను ఆగస్టు 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తామని అన్నారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు..

- ఏటీఎం కార్డు సైజులో..

ఏటీఎం కార్డు సైజులో నూతన రేషన్ కార్డులు ఉండబోతున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కొన్ని మ్యాపింగ్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ షాపులు ద్వారా జీసీసీ ఉత్పత్తులు అందించే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నాలుగు కోట్ల మందికి రేషన్ సరుకులు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్యాస్ రాయితీ విషయంలో కూడా

2 లో..

### ఘనంగా టీజీ భరత్
## జన్మదిన వేడుకలు



మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలు కర్నూలులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా

2 లో..




### పెట్టుబడి పేరుతో వీసాలకు
## క్యూ కడుతున్న భారతీయులు

మన గళం, న్యూఢిల్లీ : అమెరికాలో సెటిల్ కావాలనుకున్న భారతీయులకు ట్రంప్ షాకుల మీద షాకులు ఇస్తుండగా.. భారతీయులు మాత్రం లోనే ఇన్వెస్ట్‌మెంట్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి పేరుతో పొందే వీసాలకు క్యూ కడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు మాత్రం భారతీయులు వెనకడుగు

2 లో..

## పెట్టుబడి పేరుతో వీసాలకు క్యూ కడుతున్న భారతీయులు



వేయడం లేదు. ఉద్యోగాలకు అవసరమైన హెచ్1బీ వీసాలు రావడం కష్టంగా మారినా.. వ్యాపారానికి అవసరమైన ఈబీ-5 వీసాలకు మాత్రం డిమాండ్ తగ్గలేదని లెక్కలు చెబుతున్నాయి. ఈబీ-5 దరఖాస్తుల డేటాను పరిశీలిస్తే.. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు ఇందుకోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. 2024 ఏప్రిల్ నుంచి భారతీయుల్లో ఈబీ-5 వీసాకు ఆదరణ పెరిగింది. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ డేటా ప్రకారం.. 2025 ఆర్థిక సంవత్సరంలో భారతీయుల నుంచి 12వందలకు పైగా ఈబీ-5 పిటిషన్లు వచ్చాయంటున్నారు అధికారులు. ఇతర రకం వీసాల జారీలో పెద్ద సంఖ్యలో బ్యాక్‌లాగ్ ఉండటంతో ఈబీ-5కు డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్1బీ, గ్రీన్‌కార్డ్‌ల జారీ కష్టంగా మారడం కూడా దీనికి కారణమైంది. ఇప్పటివరకు ఇమిగ్రేషన్ సంస్థ దగ్గర దాదాపు కోటి 10లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో వేగంగా లభించే ఈబీ-5ను అమెరికా శాశ్వత నివాసానికి మార్గంగా ఎంచుకుంటున్నారు భారతీయులు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ' సంస్థ లెక్కల ప్రకారం 2024లో భారతీయులకు 14వందల 28 ఈబీ-5 వీసాలను జారీ చేశారు. 2023లో ఈ సంఖ్య కేవలం 815 మాత్రమే ఉంది. ఈబీ-5 వీసాలను.. ట్రంప్ ప్రకటించిన విధంగా.. గోల్డ్ కార్డులతో భర్తీ చేయనుండటంతో డిమాండ్ ఇంకాస్త పెరిగినట్లు తెలుస్తోంది.

## వినూత్నంగా రేషన్ కార్డ్స్ అందిస్తాం



డిజిటల్ వారెంట్ కూపన్ను అందిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు ఉత్తరాంధ్రలో పర్యటించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నెలలో 15 రోజుల పాటు రేషన్ సరుకులు అందజేస్తామని పేర్కొన్నారు. 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటివద్దకే సరకులు అందిస్తామని వివరించారు. ఎండీయూ వాహనాలు తొలగింపు విషయంలో సుమారు రూ.200 కోట్లు నష్టం జరిగిన ముందుకు వెళ్ళామని నాందెడ్ల మనోహర్ చెప్పుకొచ్చారు. దీపం పథకం ద్వారా ఫేజ్-1లో కోటి మందికి, ఫేజ్ 2లో 95 లక్షల మందికి సబ్సిడీ అందించినట్లు తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశాని ఆయన స్పష్టం చేశారు. అలాగే.. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెట్టినట్లు, చట్టంలో మార్పులు కూడా తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో తప్పు ఎవరు చేసినా కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

## భర్తలు విసుక్కుంటే పడకండి.. ఫ్రీ బస్ ఎక్కి పుట్టింటికి వెళ్లిపోండి



మన గళం డెస్క్ : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాస్యాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇదివరకటిలా ఇంట్లో భర్త విసుక్కున్నా, కసురుకున్నా పడాల్సిన అవసరం లేదని.. ఫ్రీ బస్సు ఎక్కేసి ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు. ఏలూరు జిల్లా తిరుమల మండలం తిరుమలంపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్పౌస్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చంద్రబాబు ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుందని తెలిపారు. 15వ తేదీ నుంచి ఆడపిల్లలు ఇంట్లో భర్త విసుక్కున్నా.. కసురుకున్నా .. పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఎంచక్కా ఫ్రీ బస్సు ఎక్కి పుట్టింటికి వెళ్లిపోండి అని సూచించారు. అప్పుడు భర్తలే డబ్బులు ఛార్జీలు పెట్టుకుని పరిగెత్తుకుంటూ వచ్చి మరీ ఇంటికి తీసుకెళ్తారని వ్యాఖ్యానించారు. రెండు రోజుల క్రితం మద్దిపాటి వెంకటరాజు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో తాజాగా వైరల్‌గా మారింది. మద్దిపాటి చేసిన వ్యాఖ్యలకు సభలో ఉన్నవారంతా నవ్వుకున్నారు కానీ.. సోషల్‌మీడియాలో మాత్రం పలువురికి ఆగ్రహాన్ని తెప్పిస్తోంది.

# రాహుల్‌పై మోదీ విసుర్లు

అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీపై కూడా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మంగళవారంనాడిక్కడ జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌పై విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తి తమకు తామే హాని చేసుకున్నాయని ప్రధాని విమర్శించారు. 'ఇలాంటి మరిన్ని డిబేట్లకు వాళ్లు డిమాండ్ చేయాలని కోరుకుంటున్నాం. వాటిని సంతోషంగా అంగీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. యావత్ ప్రపంచం వారి ప్రవర్తనను చూసింది. వాళ్లను మనమెందుకు ఆపాలి?' అని మోదీ అన్నారు. కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఆయన ఏదో ఒకటి చెబుతూనే ఉంటారని, తరచు ఆయన చిన్నపిల్లవాడిలా ప్రవర్తిస్తుంటారని, సుప్రీంకోర్టు కూడా ఆయనను మందలించిందని అన్నారు. యావద్దేశం వాళ్ల ఆకతాయితనాన్ని చూసిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ప్రశంసిస్తూ, ఇప్పుడు ఆయన సుదీర్ఘకాలంగా హోం మంత్రిగా పని చేసిన క్రెడిట్ దక్కించుకున్నారని అన్నారు. దీనికి ముందు, పార్లమెంటులో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రధానమంత్రికి పార్టీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు. 'హర్ హర్ మహదేవ్' నినాదాల మధ్య ఆయనను సత్కరించారు. హోం మంత్రి అమిత్‌షా మోదీ మెడలో దండవేయడంతో ఎంపీలు చప్పట్లు చరుస్తూ సంతోషం వ్యక్తం చేసారు.

**- ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానం**

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌పై ఒక తీర్మానాన్ని ఆమోదించారు. 'ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహదేవ్‌ను ఎంతో అంకితభావంతో, సాహసంతో చేపట్టిన సాయుధ బలగాలను అభినందిస్తున్నాం. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు వారెంతో అంకితభావంతో త్యాగాలకు వెనుదీయకుండా సేవలదించారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాం' అని ఆ తీర్మానం పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసాధారణ, విజనరీ నాయకత్వాన్ని ప్రశంసించింది. కీలక సమయాల్లో దేశానికి సరైన దిశానిర్దేశం చేసేందుకు తీసుకున్న కీలక నిర్ణయాల ద్వారా దేశప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారంటూ కొనియాడింది.

## ప్రయాణికుల మాటున గంజాయి తరలిస్తున్న మహిళలు అరెస్టు




అందుకోసం రైళ్లను ఎంచుకొని ఎవరికి అనుమానం రాకుండా రాష్ట్రాల సరిహద్దులు దాటించేస్తున్నారు. అయితే ఇటీవల రైళ్లలో గంజాయి , గంజాయి చాక్లెట్లు తరలిస్తున్నారని ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా పెట్టి గంజాయి, గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి అరెస్టులు చేస్తున్నారు. అయితే పోలీసుల కళ్లుగప్పి మహిళలను స్మగ్లర్లుగా వాడుకుంటున్న తరుణంలో ఇటీవల గంజాయి రవాణాను అడ్డుకోవడం అడ్డంకిగా మారింది. దీనితో స్మగ్లర్ల ఎత్తును చిత్తు చేసేలా డ్రగ్స్ రవాణాను ఇట్టే పసిగట్టగలిగే డాగ్‌ను రంగంలోకి దింపారు పోలీసులు. దీంతో ఇట్టే దొరికిపోయారు గంజాయి సరఫరా చేస్తున్న మహిళలు.

డాగ్ స్క్వాడ్‌కు చెందిన నార్కో డాగ్ లియో విజయవాడ రైల్వే స్టేషన్‌లో 30 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించింది. క్రైమ్ ఇంటెలిజెన్స్, రైల్వే డాగ్ స్క్వాడ్, విజయవాడ సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా షాలిమార్-చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో డ్రగ్స్ ను గుర్తించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన నార్కో డాగ్ లియో ముగ్గురు మహిళా ప్రయాణికుల దగ్గర ఉన్న మూడు అనుమానాస్పద బ్యాగులను గుర్తించి పోలీసులను హెచ్చరించింది. దీనితో ఆ బ్యాగులను వదిలి దూరంగా వెళ్తున్న ప్రయాణికులను సైతం గుర్తించి పోలీసులను అలర్ట్ చేసింది. ఆ బ్యాగ్స్‌లో 30 కేజీలు బరువున్న 7 పొడి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని సుశాంతి, మనీషా, పుష్పలతను అదుపులోకి తీసుకున్నారు. చెన్నైలో గంజాయిని అమ్మాలనే ఉద్దేశంతో ఒడిశాలోని నబరంగ్‌పూర్ నుంచి ప్రయాణించి విశాఖపట్నంలో రైలు ఎక్కారని విచారణలో తేలింది. విశాఖపట్నంలో బోలా అనే వ్యక్తి గంజాయిని ముగ్గురు మహిళలకు అప్పగించారు. విశాఖ నుంచి చెన్నై బయల్దేరిన ముగ్గురు మహిళలను లియో గుర్తించడంతో ముగ్గురు మహిళలను కటకటాల్లోకి నెట్టారు పోలీసులు.

## మహిళల భద్రత కోసం బస్సుల్లో సీసీ కెమెరాలు

నిర్ణయాన్ని మంత్రివర్గానికే వదిలేశారు. తిరుపతి - తిరుమల మధ్య నడిచే సప్తగిరి ఘాట్ సర్వీసుల్లో ఈ పథకం వర్తించదు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ అమలు చేయనుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఈ పథకానికి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' అనే పేరును ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లినా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయాలని నిర్ణయించినట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. ఈ నెల 15న దీనిని ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ పథకాన్ని 5 కేటగిరీ బస్సుల్లో అమలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ఈ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆధార్, ఓటరు, రేషన్ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణిస్తామని



వివరించారు.

## ఘనంగా టీజీ భరత్ జన్మదిన వేడుకలు

పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి టీజీ భరత్ జన్మదినాన్నిపురస్కరించుకుని కర్నూలులో ఉన్నటువంటి కిమ్స్ హాస్పిటల్ - 5, ఒమేగా హాస్పిటల్ - 5, ఓల్డ్ అసోసియేషన్ వైద్యుల సంఘం - 5, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు - 5 మొత్తం 20 ట్రాలీలను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు డొనేట్ చేయడం జరిగింది. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్, డా. వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల ప్రిన్సిపల్, డా.చిట్టి నరసమ్మ , డిప్యూటీ సూపరిండెంట్, డా.శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఇన్ చార్జ్ సీఎస్ఆర్ఎమ్ఓ డా.వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎమ్ఓ డా.పద్మజ, ఓల్డ్ అసోసియేషన్ సంఘం వైద్యులు డా.గోవింద్ రెడ్డి, డా.బాలమద్దయ్య, డా.వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్, డా.శివ బాల, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**- టీజీ భరత్ కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గౌరు**

మంత్రి టీజీ భరత్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశ్వర స్వామి ప్రతిమ అందజేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా మంత్రి టీజీ భరత్ కు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శుభాకాంక్షలు తెలిపారు.



## అమరావతి నిర్మాణానికి విరాళాలు సేకరణ

మన గళం, అమరావతి : ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రజల నుంచి విరాళా లు స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజధానికి ఆర్థికంగా సాయం చేయాలన్న ఆకాంక్ష ఉన్న వారి కోసం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో ఇందుకు ప్రత్యేకంగా 'డొనేట్ ఫర్ అమరావతి' అనే ఆప్షన్ ఇచ్చింది. దీనిపై క్లిక్ చేస్తే క్యూఆర్ కోడ్ కనిపిస్తుంది. ఈ కోడ్‌ను స్కాన్ చేసి రాజధాని నిర్మాణా నికి మీకు వీలైనంత నగదు విరాళంగా అందజేయవచ్చు. మీరు డొనేట్ చేసిన డబ్బులు మొత్తం ఏపీ సీఆర్డీఏ అకౌంట్‌కు జమవుతుంది.

2015లో అక్టోబరులో నూతన రాజధాని నిర్మాణం కోసం అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు 'మై బ్రిక్, మై అమరావతి'ని ప్రారంభించారు. ఒక్కో -ఇటుకను 10 రూపాయలు వెచ్చించి ప్రజలు కొనుగోలు చేశారు. చంద్రబాబు ప్రారంభించిన ఈ వినూత్న కార్యక్రమానికి అప్పట్లో ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. పలువురు ఎన్ఆర్ఐలు ఒక్కొక్కరు 10,000 ఇటుకలను విరాళంగా ఇచ్చారు. డొనేట్ చేసిన వ్యక్తికి సీఎం చంద్రబాబు సంతకంతో కూడిన రశీదు వెళ్లింది. తాజాగా అమరావతి కోసం క్యూఆర్ కోడ్ ద్వారా విరాళాలను సేకరిస్తున్నారు.

అమరావతిలో ముమ్మరంగా భూగర్భ విద్యుత్ లైన్ల పనులు: మరోవైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు, జనావాసాలకు ప్రభుత్వం భూములు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఆ భూముల్లో చాలా చోట్ల 220%, 132% హైటెన్షన్ విద్యుత్ లైన్ల స్తంభాలు ఉన్నాయి. వీటి వల్ల ఆయా సంస్థల నిర్మాణాలకు ఇబ్బందులు రాకుండా భూగర్భ విద్యుత్తు లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం తాళ్లాయపాలెంలోని 400 సబ్‌స్టేషన్‌తో పాటు లింగాయపాలెం, నేలపాడులో నిర్మించబోయే 220% సబ్‌స్టేషన్ల నుంచి వచ్చే లైన్లను భూగర్భంలో వేసే పనులు జరుగుతున్నాయి.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

- అక్రిడిటేషన్ గడువు పొడిగించకుండా కొత్తవి ఇవ్వాలి
- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి
- సీనియర్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (%ూాఖఔజీ%) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ కొండప్ప, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్ వీ సుబ్బయ్య, గౌరవ సలహాదారులు వైవీ క్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, జిల్లా కోశాధికారి అంజి, ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివరాజ్ కుమార్, అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, చిరంజీవి, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్లు ధరణి కిషోర్, ఖలీల్, హుస్సేన్, మస్తాన్, ప్రకాష్, నాగేశ్వరరావు హెచ్చరించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆక్రిడిటేషన్ మంజూరులో అసంబద్ధమైన నిర్ణయాలు, నిబంధనలు విధించడం వలన 23 వేల నుంచి 9 వేలకు ఆక్రిడిటేషన్లు కుదించడం జరిగిందన్నారు. తాము అధికారంలోకి వస్తే అందరికీ ఆక్రిడిటేషన్లు ఇస్తామని కూటమి పార్టీల నేతలు చెప్పారని, అయితే ఏడాదిన్నర దాటిన ఇంతవరకు కొత్త ఆక్రిడిటేషన్ల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. మూడునెలలకు ఒక్క సారి పొడిగిస్తూ పోతూనే ఉన్నారన్నారు. దీంతో చాలా జర్నలిస్టులు హెల్త్ కార్డు అవకాశం కోల్పోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రిడిటేషన్లు రెన్యువల్ చేయకుండా కొత్త అక్రిడిటేషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని మానిఫెస్టో లో పెట్టారని, అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రద్దు చేయబడిన యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, బీహార్ రాష్ట్రాల తరహాలో సీనియర్ జర్నలిస్టులకు ఫించన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు రామయ్య, అశోక్ గౌడ్, మోహన్, ఇంతియాజ్, రాజశేఖర్, మల్లికార్జున, మంజు, రంగన్న, సుధాకర్, ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్, నాయకులు రఫీ, అంజి, వీడియో జర్నలిస్టులు చంద్ర శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో పతకాలు

మనగళం, కర్నూలు సిటీ : పల్నాడు జిల్లాలో ఇటీవల జరిగిన 19వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించినట్లు జిల్లా సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు తెలిపారు. అండర్ 14 బాల బాలికల విభాగంలో మూడవ స్థానం,అండర్ 19 బాలికల విభాగంలో మూడవ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కర్నూలు అవుట్డోర్ స్టేడియం నందు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించడం గర్వకారణం అన్నారు. జాతీయస్థాయి పోటీలలో కూడా జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు శేషు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.




# జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లాలోని ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో కనీస మౌళిక వసతులు కల్పించని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు ఆనంద్ బాబు, కన్వీనర్ ఎద్దుపెంట అంజి, వైస్ చైర్మన్ బాలక్రిష్ణ తదితరులు కర్నూలు ఆర్ఐఓకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని కొన్ని ప్రయివేటు కళాశాలల్లో సైన్స్ ల్యాబ్ లు, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకుండా నిర్వహిస్తున్నారని వారు ఆర్ఐఓకు వివరించారు. మరికొన్ని కళాశాలలు అర్హత లేని అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలోని ప్రయివేటు కళాశాలలపై తనిఖీ చేపట్టి మౌలిక వసతులు కల్పంచాలని, నాణ్యమైన విద్యను అందించ లేనప్పటికీ అక్రమంగా బలవంతంగా వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవాలనీ నాయకులు కోరారు.

# పైప్‌లైన్ మరమ్మత్తు పనులు పూర్తి

- 21, 25వ వార్డులకు యథావిధిగా తాగునీటి సరఫరా
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : దేవనగర్ సమీపంలో అదనపు రైల్వే లైన్ పనుల కారణంగా దెబ్బతిన్న మున్సిపల్ 400 ఎంఎం పైప్‌లైన్ మరమ్మత్తు పనులు పూర్తి అయ్యాయని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన సమస్య ప్రదేశానికి వెళ్లి, మరమ్మత్తు పనులను పరిశీలించారు. అంతకుముందు 2వ వార్డులో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుముల వసూళ్లు చేస్తున్న నోడల్ అధికారి, సచివాలయ కార్యదర్శుల వద్దకు వెళ్ళారు. వారితో మాట్లాడి పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేవనగర్ సమీపంలో కేసీ కెనాల్, రైల్వే లైన్ మధ్యలో మున్సిపల్ 400 ఎంఎం పైప్‌లైన్ ఉందని, సోమవారం రైల్వే లైన్ నిర్మాణ పనులు జరుగుతుండగా అకస్మాత్తుగా పైప్‌లైన్ పగిలిపోయిందన్నారు. వెంటనే పైప్‌లైన్ మరమ్మత్తు పనులను ప్రారంభించి మంగళవారం సాయంత్రానికి పూర్తి చేశామన్నారు. ఫలితంగా 21, 25 వార్డుల్లో తాగునీటి సరఫరా బుధవారం నుండి యథావిధిగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, ఆర్ఓ జునైద్, డీఈఈలు గిరిరాజ్, నరేష్, ట్యాబ్ ఇన్ స్పెక్టర్లు రఫీ, మాధవస్వామి, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పుల్లన్న, గిడ్డయ్య సేవలు మరువలేనివి

మనగళం, కర్నూలు సిటీ : ఏపీ రజక వృత్తిదారుల సంఘం బలోపేతానికి పుల్లన్న, గిడ్డయ్య చేసిన సేవలు మరవలేనివని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురు శేఖర్, సీఐటీయూ జిల్లా నాయకులు రాముడు కొనియాడారు. మంగళవారం సంఘం జిల్లా కార్యాలయం, వీరనారి ఐలమ్మ ఆఫీసు నందు ఏపీ రజక వృత్తిదారుల సంఘం కర్నూల్ న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో న్యూ సిటీ కార్యదర్శి సి శేషాద్రి అధ్యక్షతన వారి వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా పుల్లన్న, గిడ్డయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుల్లన్న, గిడ్డయ్య మరణించి ఐదు సంవత్సరాలు పూర్తయిందని వారి లేను లోటు సంఘానికి నష్టదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికీ సంవత్సరం పూర్తయిన ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలం చెందిందని విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తూ రజక వృత్తిదారులకు హాని కలిగించే ఒక ప్రయత్నం జరుగుతుందని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓల్డ్ సిటీ కార్యదర్శి సి. జయమ్మ, ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మ, జిల్లా ట్రెజరర్ సిహెచ్. శ్రీనివాసులు, న్యూ సిటీ అధ్యక్షుడు సి రాముడు, పుల్లన్న కుటుంబ సభ్యులు రమణ, శ్రీనివాసులు, దేవేంద్ర, మధు, నగర కమిటీ సభ్యులు సి.ఎల్లయ్య, మద్దిలేటి, కర్రన్న, పకీరప్ప, దర్గమ్మ, జయమ్మ, శివ, మధు తదితరులు పాల్గొన్నారు




# వికృత రాతలతో ఆటోలు

- రోడ్డు నిబంధనలను ఖాతరు చేయని డ్రైవర్లు
- పట్టించుకోని పోలీస్ యంత్రాంగం






మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు నగరంలో ఆటో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. నిబంధనలు తుల్లబెట్టేలా ఆటోలు తిరుగుతున్నా పట్టించుకునే వారెవ్వరూ లేరన్నట్టుగా పరిస్థితి కొనసాగుతోంది. పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న ఆటోలపై విపరీతమైన రంగులు, భయానక రూపాలు, అసభ్య పదాలు వికృత రాతలు కనిపిస్తున్నాయి. నేర ప్రవృత్తి ప్రస్ఫుటంగా కనిపించేలా రాతలు దర్శనమిస్తున్నాయి. విచిత్రమైన వేషధారణ, తలకట్టులతో యువ ఆటో డ్రైవర్లు కనిపిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఖాకీ చొక్కా వేసుకునే పరిస్థితే లేదు. కొంతమంది ఆటో డ్రైవర్లు షార్ట్ ధరించి ఆటోలు నడుపుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. చాలా ఆటోలు కంపెనీ హార్న్ కాకుండా అనుకూలీకరించిన హార్న్ లు వేయించి భీకర శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు..

ఆటో వెనక భాగం మధ్యలో ఉండాల్సిన పారదర్శక ఖాళీగా ఉండాలి. ఇది వెనక నుంచి వచ్చే వాహనాలకు దృశ్యాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయాలని రవాణా శాఖ నిబంధనల్లో ఉంది. అయితే చాలా ఆటోలు పూర్తిగా మూసివేసి, ప్రచార పోస్టర్స్, అంతర్గతంగా ఫ్లెక్సీలు లాంటివి ఏర్పాటు చేసుకుని తిరుగుతున్నాయి. ఇది ప్రమాదాలే కాకుండా భద్రతా లోపం కూడా తలెత్తే పరిస్థితి ఏర్పరుస్తోంది. ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు ఆటోలో జరిగితే కూడా తెలుసుకోలేని పరిస్థితి. ముఖ్యంగా రాత్రి వేళ్లలో... ఇంత జరుగుతున్న పట్టించుకొని పోలీస్ యంత్రాంగం మీద సర్వత్రా విమర్శలు రేకెత్తుతున్నాయి.

నగరంలో చాలా మంది ఆటో డ్రైవర్లు మైనర్లు ఉన్నారు. అయినా పట్టించుకునే నాథుడే లేదు. ఆటో డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ నడుపుతున్న పట్టించుకొని నిఘా వ్యవస్థపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు ఎక్కడ? చర్యలు ఎవరిది?

ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఈ అనియంత్రిత ఆటో రవాణాపై గమనించకపోవడం ఆందోళనకరం. చెక్ పోస్టులు వద్ద ఎలాంటి తనిఖీలు లేకుండా, టాప్ పై మ్యూజిక్ సిస్టమ్స్, డిజైన్లు, స్టిక్కర్లు అన్నీ యథేచ్ఛగా పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు కఠినంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసు విభాగం ఆటోలకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. అసభ్య రాతలు, శబ్ద హార్న్లు, భద్రతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న టాప్ డిజైన్లను తొలగించాలంటున్నారు నగర ప్రజలు.

# స్మార్ట్ మీటరు మా ఇళ్లకు వద్దు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగరంలోని బి క్యాంప్ కరెంటు ఆఫీస్ ముందు ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అదాని స్మార్ట్ మీటరు మా ఇళ్లకు వద్దంటూ ధర్నానిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి రజక సంఘం న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షులు ఆర్ నరసింహులు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి రాధాకృష్ణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన కరెంటు విధానాన్ని తీసుకువచ్చి ప్రజల పైన మోయలేని కరెంటు భారాలు వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రం తీసుకువచ్చిన నూతన కరెంటు విధానాన్ని అమలు చేస్తూ అదానీ స్మార్ట్ మీటర్లు ప్రజలఇళ్లకుపెడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటరు ఇళ్లకు పెడితే పగలగొట్టండి అని చెప్పిన కూటమి పెద్దలు మాట తప్పి స్మార్ట్ మీటరులు ప్రజల ఇళ్లకు బిగించి ప్రజల పైన మోయలేని భారాలు వేస్తున్నారని విమర్శిచారు. కరెంటు చార్జీలు తగ్గేవరకు, స్మార్ట్ మీటర్ రద్దు చేసేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సెంట్రింగ్ యూనియన్ నాయకులు లియా కత్ అలీఖాన్, రజక సంఘం ఓల్డ్ సిటీ కార్యదర్శి సి శ్రీనివాసులు, సీపీఎం 23వ వార్డు కార్యదర్శి కె.వి జనార్ధన్ రావు, కేవీపీఎస్ 23వ వార్డు కార్యదర్శి పి బాబురావు, 19 వ వార్డు నాయకులు ఆర్ పెదబాబు మాట్లాడారు. అదానీ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తే ప్రతి ఇంటికి 17వేల రూపాయలు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, రాజశేఖర్, నాగరాజు, బిర్లా గేట్ రాజశేఖర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన నాగమధు యాదవ్



మనగళం, కర్నూలు సిటీ : యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భానును ఢిల్లీలో మంగళవారం నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగ మధుయాదవ్ మర్యాదగా పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాగమధు మాట్లాడుతూ దేశంలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా, యువతకు ఉద్యోగ కల్పన, యువత, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

## శక్తి యాప్, వాట్సప్ సేవలపై అవగాహన





మనగళం, కర్నూలు సిటీ : జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబర్ల పై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వీటి ప్రయోజనాలను వివరిస్తున్నారు. గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ తేడాను విద్యార్థినులకు వివరిస్తూ చైతన్య పరుస్తున్నారు. శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు రక్షణ , భద్రత ఉంటుందని, ప్రతి ఒక్కరు శక్తి యాప్ ను ఫోన్లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీం బృందాల సభ్యులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112, ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. మహిళలు శక్తి వాట్సప్ నంబర్ 7993485111 కు కాల్ చేసినా, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటాయని చెప్పారు. 24/7 శక్తి వాట్సాప్ నంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అదేవిధంగా డయల్ – 112, 181, 1098, 1930 నెంబర్ల ఉపయోగాలు వివరిస్తున్నారు. సోషల్ మీడియా ప్రభావం, చదువుకు ఉన్న ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ రూల్స్, బాల్యవివాహాలు, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పిస్తూ ప్రజలను పోలీసులు చైతన్య పరుస్తున్నారు.

## ఉద్యోగాల పేరుతో సైబర్ మోసాలు

- మీ భద్రత... మీ చేతుల్లోనే ఉంది
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



మనగళం, కర్నూలు క్రైం : లోకల్ యాప్ లో ఫేక్ నోటిఫికేషన్ల ద్వారా నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకొని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ సైబర్ నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో ఇటీవల కొన్ని వెలుగులోకి వచ్చాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోకల్ యాప్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ కంపెనీల ఉద్యోగాలు అంటూ నకిలీ ప్రకటనలు ప్రచురించి, అభ్యర్థుల వద్ద నుంచి ధ్రువపత్రాలు, ఫీజులు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. కొంతమంది తాము ప్రభుత్వ అధికారులమని చెప్పుకొని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత దీనికి బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీ భద్రత... మీ చేతుల్లోనే ఉందని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైతే, వెంటనే సైబర్ క్రైమ్ 1930 హెల్ప్ లైన్ నంబర్కు ఫిర్యాదు చేయాలన్నారు.

## వర్షాలు కురువాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు



మనగళం, కల్లూరు: వర్షాలు సకాలంలో కురువాలని, పంటలు మంచిగా పండాలని కోరుతూ కల్లూరు మండల, పర్ల గ్రామం రైతులు, ప్రజలు మంగళవారం నాగలాపురం సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజులుగా గ్రామంలో అఖండ భజన నిర్వహించిన రైతులు పర్ల నుంచి పిల్లాపాపలతో ఎడ్ల బండ్లపై వెళ్లి సుంకులమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించారు. అదేవిధంగా నైవేద్యం సమర్పించి వర్షాలు కురువాలని పర్ల రైతులు అమ్మవారిని వేడుకున్నారు.

## యువగళం పాదయాత్ర బుక్ లెట్ ను ఆవిష్కరించిన తిక్కారెడ్డి



మనగళం, కర్నూలు సిటీ : టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం యువగళం పాదయాత్రకు సంబంధించిన పుస్తకాన్ని నాయకులతో కలిసి కర్నూలు పార్ల మెంట్ పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత రాష్ట్రంలో తుగ్లక్ పాలన కొనసాగించారని విమర్శించారు. ఎటుచూసినా అరాచకం, హత్యలు, మహిళలపై హత్యాచారాలు, మాఫియాలు, ఇసుక, మద్యం, మైనింగ్ భూ దందాలు వంటివి పరిపాటిగా మారాయన్నారు. ఇలాంటి తరుణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నేను మీకు అండగా ఉంటానని ప్రజలకు మనో ధైర్యాన్ని కల్పించడం కోసం, 2023 జనవరి 27న కుప్పం నుండి యువగళం పేరుతో రాష్ట్ర వ్యాప్త పాదయాత్రకు నాంధి పలికారని గుర్తు చేశారు. దాదాపుగా రాష్ట్రం మొత్తం 4,123 కి.మీ మేర పాదయాత్ర కొనసాగిందన్నారు. పాదయాత్రకు సంబంధించిన ముఖ్యమమైె ఘట్టాలను ఒక పుస్తకం రూపంలో ప్రచురితం చేసి జిల్లాలలకు పంపడం జరిగిందని వివరించారు. పాదయాత్రంలో ప్రజలకు నారా లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని తిక్కారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ విజయకుమార్, పుల్లయ్య, పి.హనుమంతరావు చౌదరి, ఎల్.వి.ప్రసాద్, అమర్నాథ్ రెడ్డి, ఆదాం తదితరులు పాల్గొ న్నారు.

## బీజేపీ నూతన కమిటీతో జిల్లా అధ్యక్షుడు సమావేశం

మనగళం, కర్నూలు సిటీ : మౌర్య ఇన్ హోటల్లో మంగళవారం భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా నూతన కమిటీతో జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యుల పరిచయం,మాటమంతి జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తం రెడ్డి, రామస్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఆర్ ఎస్ యూ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ

మనగళం, కర్నూలు సిటీ : విజయవాడ లో సెప్టెంబర్ 12,13,14 తేదీలలో నిర్వహించే ఆర్ ఎస్ యూ రాష్ట్ర మహాసభల లోగో, పోస్టర్లను శాప్ చైర్మన్ రవినాయుడు ఆవిష్కరించారు. మహాసభలో విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## గోరంట్ల గ్రామంలో ఎంఏఓ మరియు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రైతులకు వ్యవసాయంలో మెలకువలు తెలియజేశారు సద్దల ఈశ్వరయ్య అను రైతు పొలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు పత్తి పొలంలో ఆకు ముడత వ్యాధి, పచ్చ దోమ, గొంగళి పురుగు నివారణ చర్యలను తెలిపారు గోరంట్ల మజారా గ్రామమైన కొత్తపల్లి గ్రామ రైతులకు రామకృష్ణ, రాముడు, అనే రైతులకు యూరియాని పంపిణీ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారి మరియు ఆర్ఎస్కే సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 8 వ తేదీన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కుమ్మరి ఎల్లప్ప ఆకస్మిక మరణం భౌతిక కాయానికి నివాళులర్పించిన సంధ్య విక్రమ్ కుమార్

మన గళం కర్నూలు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజవర్గం కర్నూలు మండలం దిన్నె దేవరపాడు గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కుమ్మరి ఎల్లప్ప గారు మంగళవారం రోజు ఉదయం ఆకస్మిక మరణం పొందారు ఈ విషయం తెలుసుకొని పుటాహుటిన గ్రామంలోకి చేరుకొని ఎల్లప్ప గారి భౌతిక కాయానికి నివాళులర్పించారు ఈ సందర్భంగా సంధ్యా విక్రమ్ కుమార్ ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మన్న గారు, కృష్ణ బాబు గారు మధుగారు మరియు జనసైనికులు పాల్గొన్నారు



## పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్లను తొలగించాలని సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముందు ధర్నా






మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో సిపిఎం సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్లను తొలగించాలని సిపిఐ సిపిఎం పార్టీల వారు కోడుమూరు సబ్ స్టేషన్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం జరిగింది . ఈ ధర్నాకు ఆహ్వానితులుగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వము ప్రజలపై కరెంటు బిల్లుల పేరుతో అదనపు చార్జీలను వసూలు చేస్తుందని అలాగే స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారం పెంచుతుందని వారు పేర్కొన్నారు ఇప్పటికైనా బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని మరియు ప్రజలపై కరెంటు బిల్లు భారాన్ని తగ్గించాలని విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు ఈ ధర్నాలో సిపిఐ సిపిఎం నాయకులు బి రాజు కె రాజు గాపూర్మియా సిపిఐ మాజీ ఎంపీటీసీ మునిస్వామి, వీరన్నలు తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

జలహక్కులపై ఉమ్మడి కుట్రలు

అరువై ఏండ్ల పాటు ఉమ్మడి పాలకులు నీళ్లు ఇవ్వకనే తెలంగాణ వాకిలి పొక్కిలైంది. తలాపున పారే కృష్ణా, గోదావరి నీళ్లు తెలంగాణ బీళ్లను తడపకుండా, ఈ గడ్డపై నిలవకుండా.. పడ్డ చినుకు పడ్డట్టుగా తరలించుకుపోయిన కుట్రల ఫలితంగానే తెలంగాణ వలసబాట పట్టింది. కరువుకు.. రైతన్నల ఆత్మహత్యలకు నెలవైంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల్లో నదీజలాల హక్కులు ప్రధానంగా నిలిచాయి. ఉద్యమనేత కేసీఆర్ సారథ్యంలో సీమాంధ్ర పాలకుల జల కుట్రలను బట్టబయలు చేసి, కాలరాయబడిన హక్కులను అవిశ్రాంత పోరాటంతో తెలంగాణ తిరిగి సాధించుకున్నది. చెరువుల పూడిక తీసుకున్నది. మూలకుపడ్డ ప్రాజెక్టులను పట్టాలెక్కించింది. కృష్ణమ్మ, గోదారమ్మను ఒడిసిపట్టింది. మొత్తంగా పదేండ్ల స్వరాష్ట్రంలో జల ఫలాలను తెలంగాణ పల్లె అనుభవించింది. నీటి వాటాలను పూర్తిగా వినియోగించుకునే ప్రణాళికలను సిద్ధం చేసుకున్నది. రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీస్తున్న వేళ మళ్లీ ఇప్పుడు ఉమ్మడి కుట్రలకు తెరలేచింది. తెలంగాణ జల హక్కులను కబళించే పన్నాగాలకు పదునెక్కింది. దాని పేరే పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టు. సూత్రధారి ఏపీ సీఎం చంద్రబాబు, పాత్రధారి కేంద్రంలోని బీజేపీ. ప్రేక్షకుడు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు సారథి రేవంత్‌రెడ్డి. ‘ఏపీ అన్నింటికన్న దిగువనున్న రాష్ట్రం. ఏటా సముద్రంలోకి 3 వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయి. అందులో నుంచి 200 టీఎంసీల వరద జలాలనే బనకచర్లకు మళ్లించి రాయలసీమకు అందిస్తాం.’ ఇదీ ఏపీ చెప్తున్న మాట. కానీ, వరద ఎక్కడి నుంచి వస్తున్నది? ఎందుకు పోతున్నది? మళ్లింపు వల్ల వచ్చే నష్టమేంటి? అన్నవే అసలు ప్రశ్నలు. మొదటగా వరద ఎక్కడిదో తెలుసుకుందాం. బచావత్ ట్రిబ్యునల్ గోదావరి బేసిన్‌ను 12 సబ్‌బేసిన్లుగా విభజించింది. ఆ తర్వాత 75 శాతం డిపెండబులిటీ అంటే కనీసం నాలుగేండ్లలో మూడేండ్ల పాటు కచ్చితంగా వచ్చే వరద ప్రవాహాలు. ఆ ప్రకారం గోదావరిలో ఏటా ఎంత నీరు అందుబాటులో ఉంటుందో లెక్కగట్టింది. ఆ జలాలన్నింటినీ బేసిన్‌లోని ఉమ్మడి ఏపీతో పాటు, పూర్వ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు వాటి వాటి పరీవాహక ప్రాంతం ఆధారంగా పంపిణీ చేసింది. 2023లో సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) గోదావరిలో ఎంత నీరుందనే దానిపై అధ్యయనం చేసింది. ఆ గణాంకాలు తేల్చిందేమంటే 75 శాతం డిపెండబులిటీపై గోదావరిలో నీటిలభ్యత 3,396.9 టీఎంసీలు.

50 ఏండ్ల సగటు నీటి లభ్యత 4,535.1 టీఎంసీలు. ఈ లెక్కన మిగులుతున్నది 1138.2 టీఎంసీలు. వాస్తవంగా ఇది మిగులు కాదు. ఇవి బేసిన్‌లోని రాష్ట్రాలు వినియోగించుకోని నికరజలాలే. ఉమ్మడి ఏపీకి ట్రిబ్యునల్ 1,486 టీఎంసీలను కేటాయించింది. అందులో తెలంగాణ వాటా 968 టీఎంసీలు, ఏపీ వాటా 531 టీఎంసీలు. అయితే, రాష్ట్ర ఏర్పాటు నాటికీ తెలంగాణ తన వాటాలో కనీసం 200 టీఎంసీలను కూడా వినియోగించుకోని దుస్థితి. అలాగే ఛత్తీస్‌గఢ్ కూడా తన వాటా 400 టీఎంసీలను ఇప్పటికీ వినియోగించుకోవడం లేదు. మహారాష్ట్ర కూడా అంతే. అందుకే గోదావరిలో వరద కనిపిస్తున్నది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ నీటి నిల్వ సామర్థ్యం పెంచుకున్నది. కాళేశ్వరం ద్వారానే 141 టీఎంసీల రిజర్వ్ కెపాసిటీ పెరుగగా, 400 టీఎంసీలకు పైగా వినియోగించుకునే వ్యవస్థలను ఏర్పాటుచేసుకుంది. ఇవికాకుండా సమ్మక్కసాగర్ 44, సీతమ్మసాగర్ 67 టీఎంసీలు మొత్తంగా నికర వాటాలో 824 టీఎంసీలను వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేసింది. భవిష్యత్తు అవసరాల కోసం ఒక 144 టీఎంసీలను రిజర్వ్ చేసి పెట్టుకున్నది. ఛత్తీస్‌గఢ్ కూడా ఇటీవల సుబోధ్‌ఘాట్ ద్వారా 90 టీఎంసీలు, మహానది–ఇంద్రావతి లింక్ ద్వారా 150 టీఎంసీలను వినియోగించుకునేలా ప్రాజెక్టులను రూపకల్పన చేసుకున్నది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్టులన్నింటి ద్వారా నీటి వినియోగం పెరిగితే ఆ మేరకు జలాలు దిగువకు పోవన్నది కండ్లముందు కనబడుతున్న సత్యం. వరద మాటున ఏపీ జలాల వినియోగానికి అంగీకరిస్తే తెలంగాణకే కాదు, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీనే కండ్లముందు కనబడుతున్న సజీవ సాక్ష్యం. రేపటి రోజున బనకచర్ల కూడా మరో పోతిరెడ్డిపాడులా మారుతుంది. బనకచర్ల ద్వారా ఒక్క గోదావరినే కాదు, కృష్ణా జలాలను కబళించేందుకు ఏపీ ప్రణాళికను సిద్ధం చేసుకున్నది. సాగర్ కుడికాలువ 80 కిమీ వద్ద బొల్లాపల్లి రిజర్వాయర్‌ను కట్టనున్నది. బనకచర్ల ద్వారా ఇటు గోదావరి, అటు కృష్ణా జలాలు తెలంగాణకు దక్కకుండాపోయే ప్రమాదం ఉన్నది. అదీగాక ఏపీ ఇప్పటికే గోదావరి ట్రిబ్యునల్ కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.

## తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



మనగళం, ఓర్వకల్లు : జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని కాల్వ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్ లకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ నిధులను వినియోగించి తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాల్వ గ్రామంలో జల్ జీవన్ మిషన్ గ్రాంట్ కింద కోటి 12 లక్షల రూపాయల వ్యయంతో రెండు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ లను నిర్మించడం జరుగుతోందన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి కాల్వ గ్రామ ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజల సంక్షేమానికి, జిల్లాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఓర్వకల్లు మండల స్పెషల్ అధికారి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యా సాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ అమల, ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వ గ్రామంలో తొలి అడుగు కార్యక్రమం



మనగళం, ఓర్వకల్లు : ఓర్వకల్లు మండలం,కాల్వ గ్రామంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. కూటమి ఏడాది పాలనలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్రు, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 8 జనసేన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

మనగళం, సి.బెళగల్ : కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం సిబెళగల్ మండల కేంద్రంలో జన సైనికుల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఈ నెల 8వ తేదీన శుక్రవారం 10 గంటలకు నిర్వహించనున్నామని సి.బెళగల్ మండల నాయకులు తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి 24 గ్రామాలకు సంబంధించి జనసేన నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈనెల 22వ తేదీన మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు ఘనంగా నిర్వహించనున్నామన్నారు. సి బెలగల్ మండల కేంద్రంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సి.బెళగల్ మండల నాయకులు దస్తగిరి, మద్దిలేటి ఫారుకు, గోపి, మామిడి చెట్ల బాలముని, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## విశ్వకర్మ యోజన కిట్ల పంపిణీ

మనగళం, కోడుమూరు: పీఎం విశ్వకర్మ యోజన కిట్లను మంగళవారం కోడుమూరు అసెంబ్లీ బీజేపీ నాయకులు వేల్పులగోపాల్, బెస్త ఈరన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతివృత్తుల వారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. దాదాపు 18 రకాల చేతివృత్తుల వారికి ప్రత్యేకంగా నెలరోజులు పాటు స్కిల్ డెవలప్మెంట్ కోర్సు ద్వార శిక్షణ ఇచ్చి పూర్తి చేసిన వారికి గౌరవ వేతనం ఇస్తూ విశ్వకర్మ యోజన కిట్లను పంపిణీ చేశామని చెప్పారు.



# ప్రజలను కార్పొరేట్లకు దోచిపెట్టె కరెంట్ స్మార్ట్ మీటర్ వద్దని,సెఖి ఒప్పందం రద్దు చెయ్యాలని సిపిఎం డిమాండ్



మన గళం కోడుమూరు: సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, వృత్తిదారుల సంఘం,కెవిపిఎస్,డివైఎఫ్, హమాలి, డప్పు కళాకారుల సంఘం కార్మిక ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను, రద్దు చేయాలని,ఆదాని చేసుకున్న, సెఖి ఒప్పందాన్ని రద్దు చేయాలని,ట్రూ ఆఫ్ చార్జీలు,ఇతర సర్ చార్జీల పేరుతో ప్రజల దగ్గర నుండి దొంగ చాటున వసూలు చేసే కరెంటు బిల్లులను రద్దు చేయాలని కోరుతూ.. గూడూరు లోని విద్యుత్ కార్యాలయం ముందు హమాలి సంఘం నాయకులు కృప, మద్దిలేటి ల అధ్యక్షతన నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస నాయక్ గారికి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ఉద్దేశించి వారు

మట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ గారు రైతులకు రాష్ట్ర ప్రజలకు స్మార్ట్ మీటర్లను పగల గొట్టండి స్మార్ట్ మీటర్ల ద్వారా కరెంట్ బిల్లులు పెరుగుతాయని ప్రజలు నష్టపోతారని ప్రచారం చేశారని గుర్తు చేశారు అదే పనికిమాలిన పనిని తెలుగుదేశం కూటమి ప్రభుత్వము వాటిని రద్దు చేయకుండా అమలు చేయడమే కాకుండా చిన్న చిన్న వ్యాపార సంస్థలను భయపెట్టి దొంగ చాటున బిగించారని ఇప్పుడు నివాస ప్రాంతాలకు పెట్టే ప్రయత్నం జరుగుతుందని అన్నారు, ఇప్పటికే ప్రజలకు పని లేక సరైన కూలీలేక ఇబ్బంది పడుతున్నారు ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వము అన్ని రకాల ధరలు పెంచుతూ మరోసారి ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో 12,771 కోట్ల రూపాయలను ప్రజల నుండి వసూలు చేసుకోవడానికి మరోసారి అనుమతి ఇచ్చిందని విమర్శించారు, కరెంటు చార్జీలు పెంచమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజల అనుమతి లేనిదే స్మార్ట్ మీటర్లు బిగించమని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారు చెప్తూనే మరో పక్క కరెంటు అధికారులకు ఒత్తిడి పెంచి స్మార్ట్ మీటర్లు ఎన్ని బిగించారు, రిపోర్టు ఇవ్వాలని అనుకున్న టార్గెట్ ను త్వరగా అమలు చేయాలని ఒత్తిడి ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు,అదే సందర్భంలో గత వైసీపీ ప్రభుత్వం అదానితో 1750 కోట్లు లంచాలు తీసుకోని చేసుకున్న ఒపందాన్ని అమలు చేస్తూన్నారు, రాష్ట్ర ప్రజల దగ్గర నుండి అనేక రకాల కరెంటు బిల్లులను పెంచుతూ, సర్చార్జీల పేరుతో అధిక డబ్బులను వసూలు చేయడం బాధాకరమన్నారు ఇప్పటికే సామాన్య ప్రజలు పనులు దొరకక కరువుతో అల్లాడుతూ అర్ధాకలతో బ్రతుకుతుండగా, ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సాయ సహకారాలు అందించకుండా మరియు వారు ప్రచారం చేసిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా, నిరుద్యోగ సమస్యను పరిష్కరించ కుండా ప్రతి ఇంటి నుండి ఒకరిని పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తామని ఇచ్చిన మాటను పక్కనపెట్టరన్నారు అలాగే కార్పొరేట్ లకు, బడా పెట్టుబడిదారుల ఆదాయం పెరిగే రకంగా భూమిని నీళ్లను కరెంటును బ్యాంకుల నుండి సబ్సిడీ రుణాలను వారికి అప్పజెప్పడం జరుగుతోందని షిరిడి సాయి ఎలక్ట్రానిక్ కంపెనీ స్మార్ట్ మీటర్లను తయారు చేస్తుండగా వాటి అవినీతి గురించి మాట్లాడిన తెలుగుదేశం ఇప్పుడు ఆ సంస్థకే 8000 ఎకరాలు భూమిని అప్పజెప్పడం ఎంత మేరకు సమంజసం అని వారు ప్రశ్నించారు, ఈ విధానాల వలన రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా నష్టపోతు బతకలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు, పేద మధ్యతరగతి ప్రజలు కార్మికులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారిని ఆదుకోవలసిన బాధ్యత ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని చెప్పిన తెలుగుదేశ ప్రభుత్వం మరోసారి అమరావతికి మోడీని తీసుకొచ్చి పవన్ కళ్యాణ్ కు చాక్లెట్ ఇప్పించారని, గతంలో చెంబు నీళ్లు, పిడికెడు మట్టి ఇచ్చి పదేళ్లు మోసం చేశారని ఇప్పుడు చాక్లెట్ తో ఇంకెంతకాలం మోసం చేస్తారని వారు విమర్శించారు,

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్పొరేట్ల ఆదాయం పెరిగే పద్ధతులను అవలంబించకుండా కరెంట్ బిల్లులు పెంచే విధంగా గత వైసిపి ప్రభుత్వం అదానితో చేసుకున్న సెఖి ఒప్పందాన్ని రద్దు చేసి,పాత కరెంటు మీటర్లనే కొనసాగించాలని, ఆవిధంగానే కరెంటు బిల్లులను తగ్గించాలని, సర్ చార్జీలను అదనపు చార్జీలను రద్దు చేయాలని, ఇప్పటిదాకా ప్రజల దగ్గర వసూలు చేసిన సొమ్మును తిరిగి ప్రజలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మునెప్ప,నాగేష్, అయ్యవారు మదిలేటి, భూత రామాంజనేయులు, సురేష్, కొమ్మురాజు, హమాలీ కార్మికులు మోహన్ రంగడు, శేఖర్, సుధాకర్, కెవిపిఎస్ నాయకులు భగవంతు, మరియు హమాలి కార్మికులు పాల్గొన్నారు



# బంగారు కుటుంబం విద్యార్థికి రూ. 50వేలు ఆర్థిక సాయం

మనగళం, నంద్యాల : పీ4 లో పథకం అమలులో భాగంగా నంద్యాల పట్టణం బొమ్మల సత్రం క్రాంతి నగర్ కు చెందిన పేద బంగారు కుటుంబంలోని విద్యార్థి ఎం.రోహన్ సాయి వార్షిక హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.50వేల ఆర్థిక సాయం అందజేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన మార్గదర్శుల దాతృత్వం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో తల్లిదండ్రుల సమక్షంలో కలెక్టరు చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్రాంతి నగర్ కు చెందిన మారెళ్ళ రమేష్ నాయుడు, మారెళ్ళ లక్ష్మీ దపతులకు ఇద్దరు పిల్లలు. రమేష్ నాయుడు పక్షవాతంతో ఎలాంటి ఉపాధి లేకుండా ఉన్నారు. వీరి భార్య కుటుంబ పోషణ కోసం క్రాంతి నగర్ రామాలయంలో స్వీపర్ గా పని చేస్తోంది. వీరి పెద్ద కుమారుడు మారెళ్ళ రోహన్ సాయి కష్టపడి చదివి పాలిటెక్నిక్ డిప్లొమాలో 94 శాతం పర్సంటేజ్ తెచ్చుకున్నారు. 2025 ఎంసెట్ లో ఉత్తీర్ణత పొంది విజయనగరం ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ 2వ సంవత్సరంలో ఉచిత సీటు పొందారు. అయితే అక్కడి హాస్టల్ లో ఉండడానికి వార్షికంగా రూ.50వేలు కట్టాలి. వీరి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న క్రాంతినగర్ కు చెందిన దంపతులు ఉపాధ్యాయులు కె. సాంబశివుడు, కె.శివకుమారి స్పందించారు. రూ.50వేల చెక్కును కలెక్టర్ చేతులమీదుగా ఎం.రోహన్ సాయికి అందించారు. సదరు విద్యార్థి బిటెక్ కాలం పూర్తి అయ్యే వరకు వసతి గృహం ఫీజు చెల్లిస్తామని ఇద్దరు ప్రభుత్వ టీచర్లు కలెక్టరుకు వివరించారు. ఇందుకు వారిరువురిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.




– జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా చెక్కు అందజేసిన ప్రభుత్వ ఉపాధ్యాయ మార్గదర్శకులు

# ఆగస్టు 19 నుంచి పీ4 అమలుకు ప్రభుత్వ నిర్ణయం

**– బంగారు కుటుంబాలకు అవసరమైన తోడ్పాటు అందించాలి**

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





మనగళం, నంద్యాల: ఆగస్టు 19 నుంచి పీ4 అమలుకు ప్రభుత్వ నిర్ణయించడం జరిగింది. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4 కార్యక్రమంపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడానికి పి4 (ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించడం జరిగిందన్నారు. 250 మంది బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వడానికి తాను కూడా మార్గదర్శిగా నమోదు కావడం జరిగిందని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచంలో తలసరి ఆదాయంలో తెలుగు వారు ప్రథమంగా ఉన్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేది నాటికి పీ4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా అనుసంధానం చేయడం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జిల్లాలో ఆగస్టు 19 నుంచి పి4 అమలును ఒక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం బంగారు కుటుంబాలుగా నమోదైన వారికి చేయూతను ఇవ్వడం కోసం ఆగస్టు 15లోగా మార్గదర్శకుల నమోదు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వాలంటీర్ గానే జరగాలన్నారు. ఎవరిని బలవంతం చేయవద్దని... సహాయం చేయాలనే మనసున్న సమయం లేని వారు ఉంటారని, మనసున్న వారు, మానవత్వం కలిగిన అలాంటి వారిని గుర్తించి పీ4 వేదిక ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు.

# ఉద్యోగాలు సాధించాలి

**– 12న కోవెలకుంట్లలో జాబ్ మేళా**

మనగళం, నంద్యాల : జాబ్ మేళా ద్వారా యువత మెరుగైన ఉపాధి పొంది జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆగస్టు 12న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జి.ఆర్.ఇన్ స్ట్రాచేమే ప్రైవేటు లిమిటెడ్, హిటిరో లాబ్, ఎస్.వి.ఎల్ మాన్ పవర్సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్, డిక్షన్ ప్రైవేటు లిమిటెడ్, పెన్నార్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, ఆర్ఎస్ ట్రాన్స్ మిషన్ ప్రైవేటు లిమిటెడ్, టి.వి.ఎస్ ఇండియా లిమిటెడ్,ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, వెంకట్ హ్యూమన్ సర్వీసెస్ లిమిటెడ్, ఎల్ అండ్ టి కన్స్ట్రక్షన్ చెందిన హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. 5వ తరగతి, పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బిటెక్, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ మరియు పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగము చేసుకోగలరని తెలియజేశారు. వీటికి సంబంధించిన ఇతర వివరముల కొరకు 9182217075, 9951400588 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డిఆర్డిఎ పిడి శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.




# ఎల్‌టీఐమైండ్‌ట్రీ చేతికి పాన్ 2.0 ప్రాజెక్టు

మనగళం, : పాన్ 2.0 ప్రాజెక్టు అమలుకు ఐటీ సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ లిమిటెడ్‌ను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఎంపిక చేసింది. వచ్చే ఏడాది ఇది అందుబాటులోకి రావచ్చని సోమవారం ఓ అధికారి తెలిపారు. 18 నెలల సమయం పట్టవచ్చన్నారు. ఇక ప్రాజెక్ట్ డిజైన్, డెవలప్‌మెంట్, అమలు, కార్యకలాపాలు, నిర్వహణను ఎల్‌టీఐమైండ్‌ట్రీ చూసుకోనున్నది. కాగా, పాన్/టాన్‌కు సంబంధించిన అంశాలన్నింటినీ సమగ్ర రీతిలో పర్యవేక్షించడానికి ఈ 2.0 ప్రాజెక్టులో లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో అలాట్‌మెంట్, అప్‌డేట్స్/కరెక్షన్స్, ఆధార్-పాన్ లింకింగ్, రీ-ఇష్యూయెన్స్ రిక్వెస్ట్స్, ఆన్‌లైన్ పాన్ వ్యాలిడేషన్ వంటివన్నింటినీ ఒకే వేదికపై పరిశీలించి పరిష్కరించనున్నారు. ప్రస్తుతం పాన్ సంబంధిత సేవలు మూడు వేర్వేరు వేదికల ద్వారా అందుతున్నాయి. అవే ఈ-ఫైలింగ్ పోర్టల్, యూటీఐఐటీఎస్ఎల్ పోర్టల్, ప్రొటీన్ ఈ-గవర్నెన్స్ పోర్టల్. పాన్ 2.0తో ఇవన్నీ ఒక్కటైపోనున్నాయి. అలా వచ్చే యూనిఫైడ్ పోర్టల్ ద్వారానే అన్ని సేవలు అందరికీ అందనున్నాయి. గత ఏడాది నవంబర్ 25న రూ.1,435 కోట్ల పాన్ 2.0 ప్రాజెక్ట్‌కు ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక ప్రస్తుత పాన్ కార్డుదారులు అప్‌గ్రేడ్ అయిన పాన్ 2.0 వ్యవస్థలో మళ్లీ కొత్తదాని కోసం దరఖాస్తు పెట్టుకోనక్కర్లేదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 81.24 కోట్లకుపైగా పాన్ కార్డులున్నాయి. 73 లక్షలకుపైగా టాన్లున్నాయి.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

మనగళం, నంద్యాల : ఉత్పాదన, సేవా రంగాల్లోని 35 యూనిట్లకు మొత్తంగా రూ. 121.44 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ, జిల్లా నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్ తదితరాలలో రాయితీ ప్రయోజనాలు కల్పిస్తోందన్నారు. గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోసం 139 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 131 పరిశ్రమలకు అనుమతులు మంజూరు అయ్యాయని, ఇంకను 8 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ర్యాంప్ కార్యక్రమం ద్వారా సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల పెంపుదలకు రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ద్వారా పరిశ్రమల స్థాపనకు యువ పారిశ్రామికవేత్తలు, మండలాల్లోని యువత ముందుకు వచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. నైపుణ్య అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేరకు జిల్లాలో స్కిల్ హబ్స్, ఈఎస్ఈలలో జాబ్ మేళాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎంత మంది యువత నైపుణ్య శిక్షణను పొందుతున్నారన్న అంశాన్ని నైపుణ్యం వెబ్సైట్ లో కలెక్టర్ పరిశీలించి, ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా 2025లో నిర్వహించే జాబ్ మేళా బ్రోచర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఎస్.మహబూబ్ బాషా, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్, ఎల్డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.




– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

# త్వరలోనే కొత్త అక్రిడేషన్ కార్డులు


**– సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

మనగళం, ప్రత్యేక ప్రతినిధి: అతి త్వరలోనే రాష్ట్రంలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ కొత్త అక్రిడేషన్ కార్డులు ఇస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ప్రక్రియ అంతా పూర్తయిందని, రేపు జరగబోయే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకొని కొత్త అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆయన చెప్పారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే జరిగింది. ఈ సందర్భంగా విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి పార్థసారథిని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఏచూరు శివ రాష్ట్ర నాయకులు ఏడుకొండలు పలువురు జర్నలిస్టులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ తమ ప్రభుత్వం జర్నలిస్టుల విషయంలో పూర్తి సానుకూలతతో ఉందని, జర్నలిస్టుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూల దృక్పథంతో ఉన్నారని, సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రేపు జరగబోయే మంత్రివర్గ సమావేశంలో దీనికి సంబంధించి తుది నిర్ణయం తీసుకోబోతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్లను ఇప్పటివరకు ఎన్డీఏ ప్రభుత్వం పొడిగిస్తూ వస్తుందని, ఇప్పటికైనా కొత్త అక్రిడేషన్లు మంజూరు చేయాలని మంత్రి పార్థసారథి దృష్టికి యూనియన్ నాయకులు తీసుకెళ్లారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, విశ్రాంతి జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని ,ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి సమర్పించిన వినతి పత్రంలో యూనియన్ నాయకులు పేర్కొన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఒంగోలు లో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ని, అద్దంకి లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను, పాలకొల్లు లో సాగునీటి పారుదల శాఖ మంత్రి రామానాయుడు , సచివాలయం లో కార్మిక శాఖ మంత్రి సుభాష్, రాజమండ్రి లో మంత్రి దుర్గేష్, విజయవాడ లో మంత్రి సత్యకుమార్ ను. ఇతర ఆయా జిల్లాలలో పలువురు ప్రజాప్రతినిధులు ను యూనియన్ నాయకులు కలిసి వినతి పత్రాలు ఇచ్చారు.

# ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత..!

మనగళం, 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంక్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది. ఈ కేసుల్లో రూ.58,772 కోట్ల పన్ను ఎగవేత జరిగిందని.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.30 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత, 2023 ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా రూ.1.32లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను గుర్తించారని, 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238కోట్లు, 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జీఎస్టీ ఎగవేత జరిగిందని అధికారులు గుర్తించారు. గడిచిన ఐదేళ్లలో సీజీఎస్టీ ఫీల్డ్ అధికారులు రూ.91,370 కేసుల్లో దాదాపు రూ.7.08 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను అధికారులు గుర్తించారన్నారు. ఈక ఆలంలో స్వచ్ఛంద డిపాజిట్ల ద్వారా వసూలు చేసిన పన్నులు రూ.1.29 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం మధ్య 44,938 కేసుల్లో దాదాపు రూ.1.79 లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పన్ను ఎగవేత వేసినట్లు కేంద్రం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీఎన్ పన్ను ఎగువేతను నివారించేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి చౌదరి లోక్‌సభలో తెలిపారు. ఈ-ఇన్వాయిస్ ద్వారా డిజిటలైజేషన్, జీఎస్టీ రివ్యూ తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ పన్ను ఎగవేతదారులను పట్టుకోవడంలో సహాయపడుతాయని చౌదరి లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సవరించిన అంచనాలతో పోలిస్తే వాస్తవ నికర కేంద్ర జీఎస్టీ వసూళ్లపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నికర సీజీఎస్టీ వసూళ్లు సవరించిన అంచనాలలో 96.7 శాతమని చౌదరి అన్నారు. నికర సీజీఎస్టీలో సీజీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ, పరిహార సెస్ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. 2025 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వసూళ్లు రూ.10.26 లక్షల కోట్లకుపైగా ఉండగా, సవరించిన అంచనాలు దాదాపు రూ.10.62 లక్షల కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో నికర సీజీఎస్టీ వసూళ్లు రూ.9.57 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. సవరించిన అంచనాలు రూ.9.56 లక్షల కోట్లలో 100.1శాతం.

# బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



మనగళం శ్రీశైలం లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (05.08.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం, బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

# నందీశ్వరస్వామికి విశేషపూజ





మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (05.08.2025) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (05.08.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# పల్లకీ ఉత్సవం

మనగళం శ్రీశైలం : ఈ సాయంకాలానికి మూలా నక్షత్రం వుండడటముతో లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (05.08.2025) రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తోంది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది.. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడుతాయి.



# ఊయల సేవ

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం ఈ సాయంకాలానికి మూలా నక్షత్రం వుండటముతో దేవస్థానం ఈ రోజు (05.05.2025) శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో సాయంకాలానికి ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామి అమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి... పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.



# చాలాకాలం తర్వాత స్వల్పంగా బలపడ్డ రూపాయి

మనగళం అమెరికన్ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం స్వల్పంగా బలపడింది. కొంతకాలంగా క్షీణిస్తూ వస్తున్న రూపాయికి ఇది కాస్త ఊరటగా చెప్పవచ్చు. ఇవాళ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 87.36 రూపాయల వద్ద స్థిరపడింది. దాంతో ఈ ఏడాదిలో నమోదైన గరిష్ఠ పతనం నుంచి రూపాయి కాస్త కోలుకున్నట్లయ్యింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆ సమయంలో ఒక డాలర్‌కు రూ.88.10 వరకు చెల్లించాల్సి వచ్చింది. దాంతో పోలిస్తే ఇవాళ్టి 87.36 రూపాయలు కొంత సానుకూలమని చెప్పవచ్చు. అయితే ఈ మధ్యకాలంలో రూపాయి తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. గడిచిన ఏడాది కాలంలో రూపాయి విలువ 4.06 శాతం బలహీనపడగా.. గత నెల రోజుల్లోనే 1.77 శాతం పతనమైంది. ఈ ఏడాది జనవరి నుంచి చూసినప్పుడు డాలర్‌పై రూపాయి విలువ సుమారు 1.82 శాతం మేర నష్టపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన గణాంకాలు, రిజర్వ్ బ్యాంక్ చర్యలు, లేదా ప్రపంచ మార్కెట్లలోని సానుకూల సెంటిమెంట్ లాంటి కారణాలవల్ల రూపాయికి డిమాండ్ పెరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ పురోగతి తాత్కాలికమే కావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ త్రైమాసికం చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ తిరిగి 87.52 రూపాయలకు చేరే అవకాశం ఉంది. రాబోయే 12 నెలల్లో కూడా రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన మెరుగుదల ఉంటేనే రూపాయి విలువ దీర్ఘకాలంలో నిలదొక్కుకుంటుందని నిపుణులు చెబుతున్నారు.

# ఏయూ ఎస్ఎఫ్‌బీతో ఎస్బీఐ లైఫ్ జట్టు

మనగళం దేశంలోని స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ)లలో అతిపెద్దదైన ఏయూ ఎస్ఎఫ్‌బీతో ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ జట్టు కట్టింది. వ్యూహాత్మక కార్పొరేట్ ఏజెన్సీ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నది. ఇందులోభాగంగా ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు చెందిన ప్రొటెక్షన్, సేవింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, చైల్డ్, మనీ బ్యాక్, రిటైర్మెంట్ తదితర పాలసీలను ఏయూ ఎస్ఎఫ్‌బీ తమ కస్టమర్లకు అందించనున్నది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో 4 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏయూ ఎస్ఎఫ్‌బీకి 2,505కుపైగా బ్రాంచీలున్నాయి. కాగా, 2047కల్లా దేశంలోని అందరికీ బీమా సదుపాయం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే కలిసి ముందుకెళ్తున్నట్టు ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఈ సందర్భంగా తెలియజేసింది.




# శక్తి పంప్స్ లాభం 97 కోట్లు

మనగళం శక్తి పంప్స్ ఇండియా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.96.83 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.110.23 కోట్లతో పోలిస్తే 12.15 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 6.43 శాతం తగ్గి రూ. 622.50 కోట్లకు పరిమితమైంది. అంతకుముందు ఇది రూ.665.32 కోట్లుగా ఉన్నది. ఈ సందర్భంగా శక్తి పంప్స ఇండియా లిమిటెడ్ చైర్మన్ దినేశ్ పాటిదార్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాలతో ప్రారంభించినట్టు, సోలార్ పంప్ సెగ్మెంట్ అంచనాలకుమించి రాణించడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఎగుమతులు నిలకడైన వృద్ధిని నమోదు చేసుకోగా, ప్లాంట్ కెపాసిటీ, టెక్నాలజీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి రూ.1,700 కోట్ల పెట్టుబడి పెట్టాలనుకుంటున్నట్టు ఆయన చెప్పారు.



# లాలప్పపై చర్యలు తీసుకోవాలి

మనగళం, కర్నూలు సిటీ : అక్రమాలకు పాల్పడిన కేవీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలప్పపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేందర్ నాయుడు, సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివప్రసాద్ గౌడ్, అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధు కృష్ణ, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు డిమాండ్ చేశారు. స్థానిక బిర్లా గేట్ నందు ఉన్న బ్రహ్మా రెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల నుండి విద్యార్థుల స్పెషల్ ఫీజులు, అక్యుములేషన్ సొమ్మును స్వాహా చేసిన కేవీఆర్ ప్రిన్సిపాల్ లాలప్ప పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్లు నిర్వహించకూడదని కరోనా నిబంధన ఉన్నప్పటికీ, అనంతపురం ట్రాన్స్ఫర్ ప్రొసిడింగ్స్ వచ్చినప్పటికీ సంబంధం లేకుండా లాలప్ప అడ్మిషన్ ప్రక్రియ చేపట్టి స్పెషల్ ఫీజులు వసూలు చేశారని ఆరోపించారు. విద్యార్థులతో ఫీజులు కట్టించుకుని ఫేక్ క్యాష్ వోచర్స్ ఇచ్చారన్నారు. విద్యార్థులు పేర్లు లేకుండా కేవలం సంఖ్య మాత్రమే చూపిస్తూ అది కూడా కేవీఆర్ కాలేజ్ విద్యార్థులు అయితే అనంతపురం జూనియర్ కాలేజ్ షీల్ వేసి విద్యార్థుల సంఖ్యను చూపించి స్వాహా చేశారన్నారు. తర్వాత ఎఫ్ఎసిగా వచ్చిన ప్రిన్సిపాల్ మల్లికార్జున అనుమతి లేకుండా ,విద్యార్థుల పేర్లు లేకుండా ఫీజులు కట్టానని ఆయనకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారని ఆరోపించారు. విద్యార్థులకు రిఫండ్ చేసేటువంటి విషయంలో చెక్కులు లక్షల్లో డ్రా చేసి ఫేక్ సంతకాలు చేసి డబ్బులను స్వాహా చేశారన్నారు. ఆర్జేడీ ఉన్నతాధికారి జరిపిన ఎంక్వయిరీ రిపోర్టులో అడ్మిషన్ ప్రక్రియ చేయడం తప్పు, ఒక్కొక్క విద్యార్థి నుండి 100 రూపాయలు వసూలు చేయడం తప్పు అని తేలినా ఆయనను ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. 2013 సంవత్సరం నుండి అనంతపురం కి బదిలీ అయిన సమయానికి కాలేజ్ అకౌంట్లో ఉన్న అక్యులేషన్ ఫండ్ పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆయన అవినీతిపై ఆధారాలు ఉన్నప్పటికీ ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ లాలప్పను వెనక్కి వేసుకు రావడం చాలా దారుణమని విమర్శించారు. విద్యార్థి ,యువజన, ప్రజా సంఘాలతో పాటు పార్టీలను కలుపుకొని దశలవారీగా ఆయన అవినీతి అక్రమాలపై, ఆయనని పదవుల నుండి తొలగించే వరకు ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి , యువజన సంఘాల నాయకులు హరి, కృష్ణ, బోస్, రవి, మురళి, వినోద్, అంజి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



# ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ..




మనగళం, : ఐదు టెస్టుల ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్ క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించి ముగిసింది. లండన్‌లోని ఓవల్ మైదానంలో జరిగిన చివరి టెస్టులో భారత్ కేవలం 6 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ సిరీస్ కేవలం ఉత్కంఠభరితమైన ఆటతోనే కాదు, ఎన్నో అద్భుతమైన రికార్డులతో కూడా వార్తల్లో నిలిచింది. పాత రికార్డులు బద్దలై, కొత్త చరిత్రలు లిఖించబడ్డాయి. ఈ సిరీస్‌లో నమోదైన 8 ముఖ్యమైన రికార్డుల గురించి వివరంగా తెలుసుకుందాం.

1. సిరాజ్ సరికొత్త రికార్డు: బుమ్రాతో సమం

భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఈ సిరీస్‌లో తన బౌలింగ్‌తో అదరగొట్టాడు. మొత్తం సిరీస్‌లో 23 వికెట్లు పడగొట్టి, ఇంగ్లాండ్ గడ్డపై ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా రికార్డును సమం చేశాడు. బుమ్రా 2021 సిరీస్‌లో ఇదే సంఖ్యలో వికెట్లు తీసి రికార్డు సృష్టించాడు. ఇప్పుడు సిరాజ్ కూడా ఆ ఘనతను సాధించి తన సత్తా చాటుకున్నాడు.

2. భారత్ చరిత్రలోనే అత్యంత దగ్గరి విజయం

ఓవల్ టెస్టులో భారత్, ఇంగ్లాండ్‌పై సాధించిన 6 పరుగుల విజయం భారత టెస్టు చరిత్రలోనే అత్యంత తక్కువ పరుగుల తేడాతో వచ్చిన గెలుపు. ఇంతకుముందు 2004లో ముంబైలో ఆస్ట్రేలియాపై 13 పరుగుల తేడాతో సాధించిన విజయం ఈ రికార్డును కలిగి ఉండేది. ఈ విజయం భారత్ టెస్ట్ క్రికెట్‌లో ఎంత ఒత్తిడిని తట్టుకోగలదో నిరూపించింది.

3. అత్యధిక టీమ్ స్కోర్: భారత్ సరికొత్త ప్రపంచ రికార్డు

ఈ సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్‌లు పరుగుల సునామీ సృష్టించారు. భారత టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్లందరూ సెంచరీలు, హాఫ్ సెంచరీలతో చెలరేగిపోయారు. ఫలితంగా ఐదు టెస్టుల ఈ సిరీస్‌లో భారత్ ఏకంగా 3,809 పరుగులు చేసి, ఒక ఐదు టెస్టుల సిరీస్‌లో అత్యధిక టీమ్ స్కోర్ సాధించిన జట్టుగా ప్రపంచ రికార్డును నెలకొల్పింది.

4. ఇంగ్లాండ్‌కు షాకింగ్ రికార్డు

ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్ జట్టు ఒక చెత్త రికార్డును మూటగట్టుకుంది. 2018 నుండి భారత్‌పై ఏ ఒక్క టెస్ట్ సిరీస్‌ను కూడా గెలవలేకపోవడం ఇంగ్లాండ్‌కు తీవ్ర నిరాశను మిగిల్చింది. ఈ రికార్డు టెస్ట్ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

5. జో రూట్ రికార్డు: స్టీవ్ స్మిత్‌తో సమం

ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జో రూట్ ఈ సిరీస్‌లో తన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. భారత్‌పై ఇది అతని 13వ టెస్ట్ సెంచరీ. ఈ ఘనతతో భారత్‌పై అత్యధిక టెస్ట్ సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మెన్ స్టీవ్ స్మిత్ (13 సెంచరీలు)తో రూట్ సమవుజ్జీగా నిలిచాడు.

6. చరిత్రలో రూట్ అరుదైన ఘనత

జో రూట్ ఈ సిరీస్‌లో మరో అద్భుతమైన రికార్డును నెలకొల్పాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (%ఔజ%) చరిత్రలో 6,000 పరుగులు పూర్తి చేసిన మొదటి ఆటగాడిగా రూట్ నిలిచాడు. ఇది అతని స్థిరమైన ప్రదర్శనకు నిదర్శనం.

7. శుభమన్ గిల్: సిరీస్‌లో అత్యధిక పరుగులు

భారత యువ కెప్టెన్ శుభమన్ గిల్ బ్యాటింగ్‌లో అద్భుతాలు చేశాడు. ఈ సిరీస్‌లో 754 పరుగులు చేసి, భారత్-ఇంగ్లాండ్ మధ్య జరిగిన ఏ టెస్ట్ సిరీస్‌లోనైనా అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో గిల్, సునీల్ గవాస్కర్, గ్రాహం గూచ్ వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టేశాడు.

8. కెప్టెన్‌గా గిల్: గవాస్కర్ రికార్డు బద్దలు!

శుభమన్ గిల్ కేవలం బ్యాట్స్‌మెన్‌గానే కాదు, కెప్టెన్‌గా కూడా తన సత్తా చాటాడు. ఈ సిరీస్‌లో 754 పరుగులు చేసి, ఒక టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా సునీల్ గవాస్కర్ నెలకొల్పిన 732 పరుగుల రికార్డును బద్దలు కొట్టాడు. గిల్ నాయకత్వం, బ్యాటింగ్ ప్రదర్శనలు ఈ సిరీస్‌లో హైలైట్‌గా నిలిచాయి.

# ప్రెస్ కాన్ఫరెన్స్ లో వెక్కివెక్కి ఏడ్చిన మహమ్మద్ సిరాజ్..

మనగళం, : ఇంగ్లాండ్‌పై అద్భుతమైన విజయం సాధించిన తర్వాత భారత క్రికెటర్లు ఆనందంలో మునిగిపోయారు. అయితే, ఓవల్ టెస్టులో భారత్ గెలిచిన అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ కన్నీటి పర్యంతమయ్యాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నప్పుడు సిరాజ్ భావోద్వేగానికి గురయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లండన్‌లోని ఓవల్ క్రికెట్ గ్రౌండ్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి, సిరీస్‌ను 2-2తో డ్రా చేసిన తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్ భావోద్వేగానికి గురయ్యారు. పక్కనే ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతుండగా, సిరాజ్ కళ్లలో నీళ్లు తిరగడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. సిరీస్‌లో ఒక పరుగుల మెషిన్‌లా మారిన సిరాజ్, అలుపెరగకుండా కష్టపడ్డాడు. ఈ సిరీస్‌లో మొత్తం ఐదు టెస్టులు ఆడిన ఏకైక భారత పేసర్ అతనే. అతని కష్టానికి ప్రతిఫలం చివరి టెస్టులో లభించింది. కీలకమైన ఐదో రోజు అద్భుతమైన బౌలింగ్‌తో ఐదు వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించాడు. ఆ విజయం తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సిరాజ్ భావోద్వేగానికి గురయ్యాడు. అతని పక్కనే ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు .. "ఒకటి చెప్పడం కష్టం. ఎందుకంటే ప్రతిరోజూ మనం కొత్త విషయాలు నేర్చుకుంటాం. మొదటి మ్యాచ్ నుంచి ఇప్పటి వరకు నేను చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ మ్యాచ్‌లో కూడా చాలామంది నాల్గో పేసర్ ఆడాలని అనుకున్నారు. కానీ అతని స్థానంలో వచ్చిన కరుణ్.. మొదటి ఇన్నింగ్స్‌లో చేసిన 50 పరుగులు మాకు చాలా కీలకం. ఆ స్కోర్ వల్లే మేం ఒక మంచి టోటల్‌కు చేరుకోగలిగాం" అని అన్నాడు. గిల్ ఈ మాటలు చెబుతున్నప్పుడు, సిరాజ్ ఎమోషనల్ అయ్యాడు. అతని కళ్లలో ఆనందంతో పాటు కష్టపడినందుకు తగిన గుర్తింపు లభించిందనే భావన స్పష్టంగా కనిపించింది. ఈ వీడియో ఇప్పుడు అభిమానుల మనసులను గెలుచుకుంది.




ఫీల్డింగ్‌లో తప్పిదానికి బౌలింగ్‌తో సమాధానం..

హైదరాబాద్‌కు చెందిన ఈ క్రికెటర్ నాలుగో రోజు చేసిన పొరపాటును ఐదో రోజు బౌలింగ్‌తో సరిదిద్దుకున్నాడు. నాలుగో రోజు హ్యారీ బ్రూక్ కొట్టిన ఒక బంతిని ఫీల్డింగ్‌లో అందుకున్న సిరాజ్, క్యాచ్ పట్టుకుని బౌండరీ లైన్‌ను తాకడంతో అది సిక్సర్‌గా మారింది. ఆ తప్పుకు చివరి రోజు బ్రూక్‌ను అవుట్ చేసి సమాధానం చెప్పాడు. అయితే, ఓవల్ టెస్టులో చివరి 50 పరుగుల కోసం ఇంగ్లాండ్ జట్టు తీవ్రంగా కష్టపడింది. భారత బౌలర్ల ఒత్తిడి కారణంగా వారు ఆరు పరుగుల తేడాతో ఓడిపోయారు. ఈ విజయం సిరీస్‌ను 2-2తో సమం చేయడంలో కీలక పాత్ర పోషించింది.

# ఇంగ్లండ్‌తో సిరీస్ డ్రా..

మనగళం, :యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టెస్టును ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ కొత్త సైకిల్ టీమిండియాకు ఇదే తొలిసిరీస్. రెడ్ బాల్ ఫార్మాట్‌లో భారత జట్టుకు గిల్ నాయకత్వంలో మొదటిసారి టీమిండియా ఇంగ్లండ్‌లో పర్యటించింది. ఈ సిరీస్‌ను గెలుచుకోలేకపోయినా.. చివరిదైన ఓవల్ టెస్టులో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. ఈ విజయం చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టీమిండియా మూడోస్థానానికి చేరుకున్నది. ఓవల్ టెస్ట్‌కు ముందు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా.. ఇప్పుడా స్థానంలో ఇంగ్లండ్ ఉన్నది. భారత్ ఐదు మ్యాచుల్లో రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో 28 పాయింట్లతో పాటు 46.67శాతం పర్సంటేజ్ ఉన్నది. ఇక ఆస్ట్రేలియా జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నది. ఆస్ట్రేలియా మూడు మ్యాచుల్లో మూడు విజయాలను నమోదు చేసింది. శ్రీలంక జట్టు రెండోస్థానంలో ఉన్నది. రెండు మ్యాచులు ఆడగా.. అందులో ఒకటి గెలువగా.. మరొకటి డ్రాగా ముగిసింది. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచుల్లో రెండింట్లో గెలిచి.. రెండింట్లో ఓడిపోగా.. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నది.

ఐదు టెస్టులో ఉత్కంఠ విజయం..

ఇంగ్లండ్‌తో ఓవల్ వేదికగా జరిగిన చివరి టెస్టులో భారత జట్టు ఆరు పరుగుల తేడాతో గెలిచింది. ఆతిథ్య జట్టుకు భారత్ 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 367 పరుగులకే కుప్పకూలింది. ఐదోరోజు ఇంగ్లండ్ గెలిచేందుకు 35 పరుగులు, భారత జట్టుకు నాలుగు వికెట్లు అవసరం. సిరాజ్ మూడు వికెట్లు తీయగా.. ప్రసిద్ధ్ కృష్ణ ఒక వికెట్ పడగొట్టాడు. రెండో ఇన్నింగ్‌లో సిరాజ్ ఐదు వికెట్లు తీయగా.. ప్రసిద్ధ్ కృష్ణకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టాడు. ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-2తో డ్రాగా ముగిసింది. శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టు చేసిన అద్భుత ప్రదర్శన చేసింది. వాస్తవానికి ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ ఫేవరెట్‌గా పలువురు మాజీలు పేర్కొన్నారు. విమర్శకులందరి నోళ్లను టీమిండియా తన ఆటతీరుతో మూయించింది భారతదేశం తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు చేసింది. ఆ తర్వాత ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇంగ్లిష్ జట్టుకు 23 పరుగుల ఆధిక్యం దక్కింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 396 పరుగుల చేసి.. ఆతిథ్య జట్టుకు 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 367 పరుగుల వద్ద ముగిసింది. జో రూట్ (105), హ్యారీ బ్రూక్ (111) పరుగులు చేసినా ఇంగ్లండ్‌ను ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయారు.




# డ్రెస్సింగ్ రూమ్‌లో సంబరాలు ఆకాశాన్నంటాయి.

మనగళం, :ఓవల్ : ఇంగ్లండ్‌తో జరిగిన ఓవల్ టెస్టులో టీమిండియా ఉత్కంఠ రీతిలో ఆరు పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. స్టన్నింగ్ విక్టరీ కొట్టిన టీమిండియా.. ఆ సిరీస్‌ను డ్రా చేసుకున్నది. అయితే ఓవల్ టెస్టు చివరి రోజు .. రసవత్తరంగా సాగింది. హైదరాబాద్ స్టార్ బౌలర్ సిరాజ్ సెన్సేషన్ క్రియేట్ చేసి ఇండియాకు విక్టరీని అందించాడు. త్రీవ టెన్షన్ పుట్టించిన ఆ మ్యాచ్‌ను.. భారత కోచ్ గౌతం గంభీర్(%+ఖఝఎ +ఖఎప్త్రఱతీ%), ఇతర టీమిండియా సభ్యులు.. డ్రెస్సింగ్ రూమ్ నుంచి వీక్షించారు. చివరలో వికెట్లు పడుతున్న సమయంలో.. కోచ్‌లు ఫుల్ టెన్షన్ ఫీలయ్యారు. గంభీర్‌తో పాటు బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కల్ కూడా ఈ సందర్భంలో ఉద్విగ్న క్షణాలను ఎదుర్కొన్నారు. గస్ అట్కిన్సన్ వికెట్‌ను తీసిన తర్వాత.. డ్రెస్సింగ్ రూమ్‌లో సంబరాలు ఆకాశాన్నంటాయి.

సాధారణంగా గంభీర్ పెద్దగా నవ్వడు. ఆయన స్మైల్ ఇచ్చే సందర్భాలు తక్కువ. కానీ ఓవల్ టెస్టు మ్యాచ్ గెలిచిన క్షణంలో .. అతను సెలబ్రేట్ చేసుకున్న తీరు ఉద్విగ్నభరితం. అతని కండ్లల్లో కన్నీళ్లు ఆగలేదు. ఇక ఆనందం పట్టలేక గంభీర్ గంతులేశాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కల్ మీదకు జంప్ చేసి హత్తుకున్నాడు. గట్టిగా అరుస్తూ ఆ విక్టరీని ఆస్వాదించాడు. కండ్లు ఆనందభాష్పాలతో నిండిపోయాయి. అయితే డ్రెస్సింగ్ రూమ్ ఎమోషన్స్‌కు చెందిన వీడియోను బీసీసీఐ షేర్ చేసింది.



Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310